క్లుప్తంగా

గ్రంథాలయ సందర్శన అలవాటుగా చేసుకోవాలి



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు

కోటవురట్ల: గ్రంథాలయ సందర్శనను అలవాటుగా చేసుకోవాలని గ్రంథాలయాధికారి అప్పలనాయుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడంపై సాధన చేయించారు. పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయుడు మస్తాన్ పాల్గొన్నారు.

నేడు సత్తెమ్మతల్లి పండగ

మునగపాక : మునగపాకలో ఆదివారం సత్తెమ్మతల్లి పండగను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెరువుకాలువ సంఘ సభ్యులు తెలిపారు. ఏటా జూన్ మొదటి ఆదివారం ఈ పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సదుపాయాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

నేడు కామాక్షి దేవి కల్యాణం

మునగపాక : నాగులాపల్లిలో ఆదివారం కామాక్షిదేవి అమ్మవారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించే అమ్మవారి కల్యాణ మహోత్సవానికి భక్తులు తరలిరావాలన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనులు చురుగ్గా జరగాలి

పాయకరావుపేట : మండలంలో జగనన్న నిర్మాణాలు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయ భవనాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు చురుగ్గా జరిగేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలని మండల ప్రత్యేక అధికారి సిహెచ్.లచ్చన్న అన్నారు. ఆయన శనివారం నామవరం గ్రామం వద్ద జగనన్న కాలనీని పరిశీలించారు. జగనన్న లే అవుట్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం పంచాయతీరాజ్ అతిథి గృహంలో అధికారులతో సమావేశమయ్యారు. అధికారులకు తగు సూచనలు, సలహాలు అందించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.సాంబశివరావు, తహసీల్దార్ కె.జయప్రకాష్, పంచాయతీరాజ్ ఏఈ బి.కచేరీ, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలకు కృషి

మునగపాక : జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ వినయ్‌కుమార్ పిలుపునిచ్చారు. హౌసింగ్ డే లో భాగంగా శనివారం మునగపాక లే-అవుట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలన్నారు.కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందజేస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో ఈశ్వరరావు, వెలుగు ఏపీఎం కొండమ్మ, తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక



విద్యార్థి రాకేష్

ఎస్.రాయవరం : గుర్రాజుపేట పాఠశాల విద్యార్థి ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కి అర్హత సాధించాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షకు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కొర్ని రాకేష్ హాజరైనట్టు ప్రధానోపాధ్యాయుడు కె.కె.ఎల్.ఎన్ ధర్మారావు తెలిపారు. ఈ పరీక్షల్లో రాకేష్ 112 మార్కులు సాధించినట్టు చెప్పారు. పాఠశాలలో నాలుగేళ్లుగా ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి మూర్తి విద్యార్థికి, పాఠశాల ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారన్నారు.

సంక్షేమం ప్రతి ఇంటి తలుపు తడుతోంది

ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

కోటవురట్ల : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టి ఆర్థిక ఆసరా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. రామన్నపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సమస్యలపై ఆరా తీసి పరిష్కారానికి అధికారులు ఆదేశాలిచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎదైనా మాట ఇచ్చారంటే అది శిలా శాసనమే అన్నారు. నవరత్నాలే కాకుండా మరిన్ని సంక్షేమ పథకాలను అడక్కుండానే ఇస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అక్కా చెల్లెమ్మలు సగౌరవంగా బతికేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను నేరుగా వారికే అందిస్తున్నారన్నారు.



రామన్నపాలెంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

పిల్లలకు బంగారు భవిష్యత్‌ను ఇచ్చేందుకు నాడు-నేడు ద్వారా పాఠశాలను అద్భుతంగా అభివృద్ధి చేసి ఇంగ్లిషు మీడియంలో నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం వైఎస్సార్ రైతు భరోసా, మహిళా సంక్షేమానికి వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, వైఎస్సార్ ఆసరా, చిన్నారుల చదువుకు అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఉండాలనే ఆశయంతో వైఎస్సార్ జగనన్న కాలనీలు, వైద్యం మరింత మెరుగ్గా ఇంటికే అందాలనే ధ్యేయంతో ఫ్యామిలీ డాక్టర్ ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ జగనన్న ప్రతి కుటుంబానికి ఆశా జ్యోతిగా మారారన్నారు. అవ్వా- తాతలకు పింఛను ద్వారా ఒకటో తేదీనే ఆసరా కలుగుతోందన్నారు. ఇంతకంటే మరింత మెరుగా సంక్షేమం అందాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం కట్టాలన్నారు. తమ గ్రామానికి గ్రామ సచివాలయ భవనం లేదని, వైఎస్సార్ జగనన్న కాలనీకి కేటాయించిన లే అవుట్‌లో సమస్యలు ఉన్నాయని, మరో స్థలంలో కేటాయించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, సర్పంచ్ పోలుపర్తి చిన్న అప్పన్న, పార్టీ నాయకులు, కిల్లాడ శ్రీనివాసరావు, శ్రీరామ్మూర్తి, శింగంపల్లి కిషోర్, బాబులు, రాజు, కొడవటిపూడి సర్పంచ్ కోసూరు అప్పారావు, మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవా భావం దేశానికే ఆదర్శం

కోటవురట్ల: గ్రామ వలంటీర్లు సేవా గుణంతో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు సన్మాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రలను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకే సమస్త సేవలు అందుతున్నాయన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ ఉత్తమ సేవలందిస్తున్నారని కొనియాడారు. పింఛన్ల పంపిణీతో వలంటీర్లు తమ సేవా గుణాన్ని చాటుతున్నారన్నారు. లబ్ధిదారులు స్థానికంగా లేకపోయినా వ్యయ ప్రయాసలకోర్చి వారి వద్దకు వెళ్లి నగదు అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి తగ్గట్టుగా వలంటీర్లు సేవా భావంతో విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. వారి సేవలను గుర్తించిన ప్రభుత్వం సముచిత రీతిలో సత్కరిస్తోందన్నారు. కార్యక్రమంలో



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచులు బి.అనిల్ కుమార్, కోసూరి అప్పారావు, రమణ, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దారు జానకమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు శింగంపల్లి కిషోర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంగ్లిషు భాషపై పట్టు సాధించాలి



ఇంగ్లిషు భాషపై అవగాహన కల్పిస్తున్న లెక్చరర్ గౌళి

అచ్యుతాపురం(అనకాపల్లి): ఇంగ్లీషు భాషపై పట్టు సాధిస్తే ఉన్నత విద్య అవకాశాలు, ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగుపడతాయని కైట్స్ కళాశాల లెక్చరర్ గౌళి అన్నారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా 27వ రోజైన శనివారం ఇంగ్లిషు భాషపై అవగాహన కల్పించారు. భాషలోని మెలకువలకు చెందిన అనేక యాక్టివిటీస్ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా నగ్నేశ్వర, బాలాత్రిపురసుందరి దేవి కల్యాణం

రాంబిల్లి: కమనీయం..కల్యాణ వైభోగం..దిమిలిలో శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత నగ్నేశ్వరస్వామి కల్యాణం శనివారం రాత్రి కనుల పండువలా నిర్వహించారు. చారిత్రక నగ్నేశ్వరస్వామి ఆలయంలో ఈ కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు మారుతీశర్మ ఆధ్వర్యంలో పురోహితుల బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ నిర్వహించిన కల్యాణ మహోత్సవాన్ని దిమిలి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి తిలకించారు.



బాలాత్రిపుర సందరి సమేత నగ్నేశ్వరస్వామి

రైలు ప్రమాద మృతులకు సంతాపం



రైలు ప్రమాద మృతులకు సంతాపం తెలుపుతున్న దృశ్యం

మునగపాక : ఒరిస్సా రాష్ట్రంలో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు శనివారం గంటవానిపాలెంలో సంతాపం ప్రకటించారు. సర్పంచ్ కోన వెంకటలక్ష్మి ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ జయలక్ష్మి మాట్లాడుతూ రైలు ప్రమాద ఘటన బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ నేతలు అరిగా శ్రీనివాసరావు, కోన అప్పలరాజు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన నైపుణ్యాలు పెంపొందించాలి

యలమంచిలి : విద్యార్థుల్లో అభ్యసన నైపుణ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని కొక్కిరాపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోడ్డేడ సత్యనారాయణ అన్నారు. శనివారం కొక్కిరాపల్లి పాఠశాలలో భాషా గణితంలో పునాది అభ్యసనా సంకల్పయాత్ర-ప్రతిజ్ఞ (జన్‌భగిధరి-జీ20 ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని నిర్వహించి ర్యాలీ చేపట్టి తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం బోడ్డేడ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో గణిత, తెలుగు భాషా సామర్థ్యాలు పెంపొందించాలని విద్యార్థులతో ప్రయోగాత్మక విద్యను, నీతికథలతో కూడిన బోధన చేపట్టడం జరుగుతోందని వివరించారు. కార్యక్రమంలో వైయస్సార్‌సీపీ నాయకులు మాజీ సర్పంచ్ పాలరౌతు నర్సింగరావు, ఉపాధ్యాయులు సుజాత, ఆర్.కె.వి.రమణ, ప్రసాదరావు, అనూష, అన్నపూర్ణ, అమ్మోజీ పాల్గొన్నారు.



కొక్కిరాపల్లి పాఠశాలలో గణితంపై అవగహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

రేపు వృద్ధుల సమావేశం

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం వి.వి.రమణ రైతుభారతి హాలులో ఈనెల 5న వృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించనున్నట్టు సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వృద్ధుల నుంచి సలహాలు, సూచనలు తెలుసుకోవడంతోపాటు గుర్తింపుకార్డులు పంపిణీ చేయనున్నామని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలి

యలమంచిలి : సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకోవాలని మైలపల్లి సూరి నర్సింగరావు అన్నారు. యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామానికి చెందిన మైలపల్లి సూరి నర్సింగరావు తన తండ్రి జ్ఞాపకార్థంగా యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కొక్కిరాపల్లి ప్రేమసమాజంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, అనాథలకు నిత్యావసర సరుకులు, వస్త్రాలు అందజేశారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో ఎంతో కొంత కేటాయించి దాతృత్వం చూపాలని, వృద్ధులకు ఈ విధంగా వితరణ చేయడం ద్వారా ఎంతో ఆనందంగా ఉందని నర్సింగరావు అన్నారు.



కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో వృద్ధులకు వస్త్రాలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నర్సింగరావు

ఎస్‌బీఐ శిక్షణ సంస్థ సందర్శన

అనకాపల్లిటౌన్: స్థానిక స్టేట్‌బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను అమరావతి ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ కృష్ణశర్మ శనివారం సందర్శించారు. సంస్థ ఆధ్వర్యంలో టూ వీలర్ మెకానిక్, హౌస్ వైరింగ్ శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు. శిక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సంస్థ డైరెక్టర్ బి.విజయకుమార్ పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



కశింకోట పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహిస్తున్న ప్రపంచ సైకిల్ దినోత్సవ ర్యాలీ



సైకిల్ తొక్కడం పై అవగాహన కల్పిస్తున్న తుమ్మపాల పీహెచ్‌సీ డాక్టర్లు,సిబ్బంది

కశింకోట: రక్తపోటు, మధుమేహం తదితర వ్యాధుల నివారణకు ప్రతి రోజూ సైకిలింగ్ చేయాలని కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని జరిపారు. ఈసందర్భంగా సైకిళ్లు తొక్కుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ వ్యాధులను అదుపులో ఉంచేందుకు సైకిలింగ్ దోహదపడుతుందన్నారు. మరో వైద్యాధికారి యశోద మాట్లాడుతూ నిత్యం సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యకరంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవోలు సత్యనారాయణ, మురళీకృష్ణ, సత్యవతి, ఆరోగ్య సిబ్బంది విజయలక్ష్మి, ప్రకాష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ అత్యుత్తమ వ్యాయామం

అనకాపల్లి రూరల్: సైకిల్ తొక్కడం మంచి వ్యాయామమని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్.వాణీ జగదీశ్వరి తెలిపారు. అంతర్జాతీయ సైకిల్ దినోత్సవం సందర్భగా శనివారం తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆస్పత్రి డాక్టర్లు,సిబ్బంది.. సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా సైకిల్ తొక్కితే గుండె జబ్బులు దరిచేరవని సూచించారు. గ్రామంలో కొందరు పిల్లలతో సైకిల్ తొక్కించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు డి.శారద,సీహెచ్‌వో జె.శ్రీనివాసరావు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జన్‌భాగిధారితో పాఠ్యంశాలపై పట్టు

అనకాపల్లిటౌన్: జన్‌భాగిధారి కార్యక్రమం ద్వారా విద్యార్థులు పాఠ్యాంశాలపై పూర్తి పట్టు సాధించవచ్చని కొత్తతలారివానిపాలెం హెచ్ఎం రెడ్డి నారాయణ రావు అన్నారు. పాఠశాల ఆవరణలో శనివారం జన్‌భాగిధారి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో నైపుణ్యం వృద్ధికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ సభ్యులను భాగస్వామ్యం చేయనున్నామన్నారు. అంతకుముందు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

జగనన్నకు చెబుదాం..



కోటవురట్లలో జగనన్నకు చెబుదాంలో అధికారులు

కోటవురట్ల: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా దీర్ఘకాలిక సమస్యలు తక్షణ పరిష్కారానికి నోచుకుంటున్నాయని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో శనివారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జానకమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



మూలకొత్తూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు

రాంబిల్లి: మూలకొత్తూరు గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మెనూ, పోషకాహారం పంపిణీ తదితర వివరాలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరవకముందే విద్యా దీవెన కిట్లు సిద్ధం

ఎస్.రాయవరం : పాఠశాలలు తెరవక ముందే పాఠ్య పుస్తకాలు, జగనన్న విద్యాదీవెన కిట్లు ఆయా పాఠశాలలో సిద్ధంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీపతి అన్నారు. మండలంలో శనివారం పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. మండల కేంద్రంలో వివిధ పాఠశాలలకు వచ్చిన పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. 60 వేలు పుస్తకాలు రావాల్సి ఉండగా 40 వేలు వచ్చాయని, మిగిలినవి మరో రెండు రోజుల్లో వస్తాయన్నారు. అనంతరం జేవీడీ కిట్ నమూనాను పరిశీలించారు. అనంతరం హౌసింగ్ డే పురస్కరించుకుని పెనుగొల్లు గ్రామంలో జగనన్న కాలనీని ప్రత్యేకాధికారి సందర్శించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న తక్షణమే బిల్లు విడుదల అవుతున్నాయని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఇతర శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలన్నారు.



మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

వలంటీర్ల సేవలు అభినందనీయం

మునగపాక : వలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘమని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని ఉమ్మలాడలో వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే వలంటీర్ల కృషే కారణమన్నారు. తమకు కేటాయించిన 50 గృహాలకు మెరుగైన సేవలందిస్తున్నారన్నారు. సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సూరిశెట్టి కృష్ణవేణి, పార్టీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, ఉప సర్పంచ్ రాము,పార్టీ నేతలు రామకృష్ణ,శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఉమ్మలాడలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

స్పోర్ట్స్ షూటింగ్, తల సైనిక్ శిక్షణ శిబిరానికి ఎంపిక

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులకు అరుదైన అవకాశం దక్కింది. ఎన్‌సీసీ ఆంధ్ర తెలంగాణ ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షూటింగ్, తలసైనిక్ క్యాంప్ సెలక్షన్స్‌లో విశాఖపట్నం గ్రూప్ ప్రాబబుల్స్‌లో ప్రశాంతి పాలిటెక్నిక్‌కు చెందిన ఆరుగురు ఎన్‌సీసీ కేడెట్స్ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు శ్రీకాకుళం ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో జూన్ 3 నుంచి 13 వరకూ జరిగే కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో ఈ క్యాడెట్స్ శిక్షణ పొందనున్నారు. ఈ క్యాంప్‌లో మొత్తం 400 మంది క్యాడెట్స్ శిక్షణ పొందనున్నారు.



శిక్షణకు ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్స్

ముగిసిన వేసవి విరామ బైబిల్ శిక్షణ

కోటవురట్ల: స్థానిక క్రీస్తు కృపాలయ బాప్టిస్టు చర్చిలో రెండు రోజులుగా జరిగిన వేసవి విరామ బైబిల్ పాఠశాల శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా చిన్నారులతో పాటల పోటీ, బైబిల్ కథలు, చిన్నారుల సినిమాలు, బైబిల్ తరగతులు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వీబీఎస్ సీఎస్ఎస్ సూపరింటెంట్ ఎస్.సంగీత్‌రాజ్, టీచర్ జి.ఎ.భవాని, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



వీబీఎస్ ముగింపు కార్యక్రమంలో చిన్నారులు

రక్షణగా ఎస్‌బీఐ బీమా పథకాలు

కశింకోట: ఎస్‌బీఐ ద్వారా మూడు రకాల బీమా పథకాలను అమలు చేస్తున్నామని, ఇవి కుటుంబాలకు రక్షణగా నిలుస్తాయని బ్యాంకు అమరావతి ప్రాంత జనరల్ మేనేజర్ కృష్ణశర్మ అన్నారు. మండలంలోని నూతలగుంటపాలెంలో యలమంచిలి ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో జన సురక్ష అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద ఏడాదికి రూ.436 ప్రీమియంతో బీమా పథకాన్ని వర్తింపజేస్తున్నామన్నారు. దీనివల్ల బీమాదారుడు ఏ విధంగా మృతి చెందినా నామినీకి రూ.2 లక్షల పరిహారం అందజేస్తారని చెప్పారు. 18 నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారికి ఇది వర్తిస్తుందని తెలిపారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ఏడాదికి రూ.20 చొప్పున చెల్లిస్తే ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబానికి రూ.2 లక్షలు పరిహారాన్ని అందిస్తారన్నారు. 18 నుంచి రూ.70 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారికి వర్తిస్తుందని చెప్పారు. వయస్సు రీత్యా అర్హత ఉన్న వారు ఈ రెండు బీమా పథకాల్లోనూ చేరవచ్చునన్నారు. దీనివల్ల రెండు పథకాల ద్వారా రూ.4 లక్షలు బీమా పరిహారం పొందవచ్చని చెప్పారు. పదేళ్ల లోపు బాలికలు ఉన్న వారు సుకన్య సమృద్ధి యోజన కింద నెలకు రూ.500 నుంచి రూ. వెయ్యి వరకు చెల్లిస్తే 18 ఏళ్ల వయస్సు వచ్చేటప్పటికి 8 శాతం వడ్డీతో కలిపి మొత్తం సొమ్ము అందజేస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ కృష్ణశర్మ

రుణాలు సద్వినియోగం : కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ) కింద విరివిగా రైతులుకు రుణాలు అందజేస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని జీఎం శర్మ కోరారు. ముద్ర, ఇతర రుణాలను అర్హులకు అందిస్తున్నామని, వీటిని వినియోగించుకోవాలన్నారు. బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.సురేష్‌ప్రభు మాట్లాడుతూ గ్రామాల్లో తమ శాఖలు లేనిచోట్ల కస్టమర్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత సేవలందిస్తున్నామన్నారు. అనకాపల్లి ఎల్‌డీఎం కె.సత్యనారాయణ మాట్లాడుతూ తమ బ్యాంకు సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు వారి సేవలను వినియోగించుకుని బీమా పథకాల్లో చేరాలన్నారు. డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ డయిజ మాట్లాడుతూ బీమా వంటి పథకాలలో చేరకపోవడం వల్ల కరోనా సమయంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఆసరా కలిగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎస్‌బీఐ అనకాపల్లి రీజనల్ మేనేజర్ కె.జగదీశ్వరరావు,డీఆర్‌డీఏ ఏరియా కో-ఆర్డినేటర్ ధర్మారావు, యలమంచిలి ఎస్‌బీఐ శాఖ మేనేజర్ జి.రవికుమార్, ఫీల్డు ఆఫీసర్ వందన, వెలుగు పథకం ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కలిగెట్ల నాయుడు, సోమిరెడ్డి గోవింద, ఉప సర్పంచ్ యలమంచిలి మారీషు తదితరులు పాల్గొన్నారు.